క్లుప్తంగా

పట్టుపురుగుల పెంపకం పరిశీలన



పట్టుపురుగుల కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ నర్సింహారావు

ఎర్రుపాలెం: మండలంలోని చొప్పకట్లపాలెంకు చెందిన రైతు బొగ్గుల శ్రీనివాసరెడ్డి చేస్తున్న పట్టు పురుగుల సాగును ఆశాఖ డీడీఓ ముత్యాలు, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు గురువారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేషన్ బియ్యం ఇవ్వాలి

చింతకాని: వినియోగదారులందరికీ రేషన్ బియ్యం ఇవ్వాలని తహసీల్దార్ బాబ్జి ప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామంలోని రేషన్ దుకాణాన్ని గురువారం తనిఖీ చేసి మాట్లాడారు. రేషన్ దుకాణంలో తప్పనిసరిగా ధరలతో కూడిన స్టాక్ బోర్డును ఏర్పాటు చేయాలని, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. రేషన్‌ను అక్రమ రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు జగదీష్, ఏకవీర తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధ్యక్ష పదవికి సూరంపల్లి నామినేషన్



నామినేషన్ అందిస్తున్న రామారావు

కొణిజర్ల: ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి కొణిజర్ల మాజీ సర్పంచ్, ఎల్‌డీఎం ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ సూరంపల్లి రామారావు గురువారం దరఖాస్తు చేసుకున్నారు. గురువారం వైరాలో నిర్వహించిన బ్లాక్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఏఐసీసీ పరిశీలకుడు మహేంద్రన్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ నెల్లూరి రమేష్, ఆత్మ మాజీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మంజుల దరఖాస్తు..



దరఖాస్తు అందిస్తున్న మంజుల

కారేపల్లి: కారేపల్లి మండలానికి చెందిన మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు పగడాల మంజుల జిల్లా డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేశారు. దరఖాస్తును ఏఐసీసీ పరిశీలకుడు మహేంద్రన్, పీసీసీ జనరల్ సెక్రటరీ, జిల్లా ఇన్‌చార్జ్ రవళిరెడ్డికి అందించారు.

అయ్యప్ప మాలధారులకు నిత్యాన్నదానం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని జేవీఆర్ పార్కు ఎదురుగా గల అయ్యప్ప ఆలయంలో దీక్షాపరులకు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఏసీపీ రఘు గురువారం ప్రారంభించారు. నవంబర్ 30వరకు అన్నదాన కార్యక్రమం నిర్వంచడం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు దోసపాటి అమరలింగేశ్వరరావు తెలిపారు. దుద్దేపూడి గ్రామానికి చెందిన చీపి రాధాకృష్ణ గురుస్వామి దీక్షాదారులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి బొంతు శ్రీనివాస్, కోశాధికారి గుండు ఉమామహేశ్వరరావు, మల్లికార్జునశర్మ, సోమేశ్వరరావు, శ్రీనివాస్, శ్రీనివాసరావు, ఫణికుమార్, సురేష్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి..

ఏన్కూరు: బీసీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించడంతో పాటు 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతూ.. జేఏసీ నాయకులు గురువారం ఏన్కూరు తహసీల్దార్ శేషగిరిరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కన్వీనర్ వర్ధబోయిన బాబు మాట్లాడుతూ.. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుకు ఈనెల 18న చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు కృష్ణ, నాగేశ్వరరావు, గణేష్, మోహన్, సాంబయ్య, సీతారాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కారేపల్లి: మండలంలోని మాధారం గ్రామానికి చెందిన, సీపీఎం సీనియర్ నాయకుడు పాపినేని వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన సంస్మరణ సభకు సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు గురువారం హాజరై, వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



లక్ష్మీనగర్ వద్ద నిలిచిపోయిన కల్వర్టు నిర్మాణం



అధ్వానంగా మారిన బైపాస్ దారి

అసంపూర్తి కల్వర్టులతో అవస్థలు

- ఎర్రుపాలెం – కొత్తపాలెం రహదారిలో రాకపోకలకు ఇబ్బందులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల అసహనం

ఎర్రుపాలెం: అసంపూర్తి కల్వర్టుల వల్ల ప్రయాణికులు, వాహనదారుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలకేంద్రం –కొత్తపాలెం ప్రధాన రహదారిలో రేమిడిచర్ల(లక్ష్మీనగర్), కొత్తపాలెంల్లో కల్వర్టు నిర్మాణాలు అసంపూర్తిగా వదిలేయడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. ప్రభుత్వం శ్లాబ్ కల్వర్టుల నిర్మాణాలకు రూ.రెండు కోట్ల నిధులు మంజూరు చేయగా.. ఆర్ అండ్‌బీ అధికారులు పనులకు ఫిబ్రవరిలోనే శ్రీకారం చుట్టారు. ఇలా ఏడు నెలలు గడుస్తున్నా నిర్మాణాలు మాత్రం ఇంతవరకు పూర్తికాలేదు.

ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు..

ఎర్రుపాలెం టూ వయా కొత్తపాలెం మీదుగా విజయవాడ పట్టణానికి ప్రతి నిత్యం వందలాది వాహనాలు ఈరోడ్డుపైనే ప్రయాణాలు సాగిస్తుంటారు. కల్వర్టు నిర్మాణ పనులు నామమాత్రంగా చేపట్టి వదిలేయడంతో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ ప్రదేశంలో ఏర్పాటు చేసిన బైపాస్ దారి కూడా అధ్వానంగా ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వర్షాలు పడినప్పుడు నీనిలిచిపోవడం, గుంతలు ఏర్పడడం, ప్రమాదకంగా మారడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. అధికారయంత్రాంగం వెంటనే స్పందించి కల్వర్టుల నిర్మాణాలు పూర్తిచేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

భయంగా ప్రయాణిస్తున్నాం..



రేమిడిచర్ల నుంచి ఎర్రుపాలెం గ్రామానికి ప్రతి రోజు ప్రయాణిస్తుంటాం. గ్రామ సమీపంలోని కల్వర్టు అసంపూర్తిగా ఉండటంతో ఏర్పాటు చేసిన బైపాస్ రోడ్డు అధ్వానంగా ఉంది. వర్షాలు కురిసినప్పుడు వాహనాలు జారుతున్నాయి. అధికారులు అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేయాలి.

– నాగిరెడ్డి నాగబాబు, రేమిడిచర్ల

త్వరగా పూర్తి చేయాలి..



అసంపూర్తి కల్వర్టు నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా నిర్లక్ష్యంగా ఎందుకు వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదు. కల్వర్టుల దగ్గర ప్రయాణించాలంటే భయమేస్తుంది. విషయాన్ని అధికారులకు తెలిపినా.. పట్టించుకున్న పాపాన పోలేదు.

– బుర్రా మల్లికార్జున్, ఆటోడ్రైవర్, ఎర్రుపాలెం

రెండు నెలల్లో పూర్తిచేస్తాం..



ఎర్రుపాలెం –కొత్తపాలెం ప్రధాన రహదారిలో నిర్మిస్తున్న కల్వర్టులను రెండు నెలల్లో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటాం. వర్షాలు కురుస్తున్న కారణంగా పనుల్లో కొంత జాప్యం జరిగిన మాట వాస్తవమే అన్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేస్తాం.

– రాజేష్, ఆర్‌అండ్‌బీ ఏఈ, ఎర్రుపాలెం

మేలు రకం విత్తనాలను ఎంపిక చేసుకోవాలి



మాట్లాడుతున్న కేవీకే కోఆర్డినేటర్ సుచరితాదేవి

చింతకాని: పంటల సాగులో రైతులు మేలు రకం విత్తనాలను ఎంపిక చేసుకోవాలని వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ టి.సుచరితాదేవి పేర్కొన్నారు. మండలంలోని తిమ్మినేనిపాలెం గ్రామంలో రాశీ సీడ్స్ కంపెనీ ఆధ్వర్యంలో గురువారం పత్తి సాగుపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించి మాట్లాడారు. స్విఫ్ట్ పత్తి రకం సాలు పత్తి సాగుకు అనుకూలంగా ఉంటుందని, రసం పీల్చే పురుగులను తట్టుకునే శక్తి ఉంటుందని తెలిపారు. కాపు ముందుగా వచ్చే లక్షణం ఉంటుందన్నారు. అనంతరం వరి, మిరప పంటలపై ఆశించే పురుగులు, తెగుళ్ల నివారణకు చేపట్టే సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం కీటక శాస్త్రవేత్త పావని, రాశీ సీడ్స్ కంపెనీ ఏరియా మేనేజర్ ముక్కపాటి రమణకుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

‘పంట నమోదు’ను నిర్వహించాలి



అవగాహన కల్పిస్తున్న మధిర ఏడీఏ స్వర్ణవిజయచంద్ర

బోనకల్: పంట నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని మధిర ఏడీఏ స్వర్ణవిజయచంద్ర సూచించారు. గురువారం మండలంలోని ముష్టికుంట్ల రైతువేదికలో మధిర నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. రబీపంటల వివరాలను నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన కల్పించారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో బోనకల్, మధిర, చింతకాని, ఎర్రుపాలెం, ముదిగొండ మండలాల ఏఓలు వినయ్‌కుమార్, సాయిదీక్షిత్, మానస, సాయిశివ, సరిత, ఐదు మండలాల ఏఈఓలు పాల్గొన్నారు.

‘కుల వివక్షతతోనే ఐపీఎస్ బలి’



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

సత్తుపల్లిరూరల్: కులవివక్ష అవమానాన్ని తట్టుకోలేక హర్యానాలో దళిత ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ మృతి చెందాడని, అందుకు గల ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ డిమాండ్ చేశారు. గురువారం గంగారం సెంటర్‌లోని ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మృతి ఘటనపై తక్షణమే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. అనంతరం కేవీపీఎస్ సత్తుపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ఐనంపూడి సనందరావు, దాట్ల రాంబాబులతో పాటు మరో 9మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. నాయకులు శ్రీనివాస్, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన



మాట్లాడుతున్న దయానంద్

సత్తుపల్లి: రుద్రాక్షపల్లి పంచాయతీలోని తోగ్గూడెం, కొమ్ముగూడెం, బాసారం, బంగ్లాబజార్ ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పరిశీలించారు. ఆయా పాఠశాలలో మౌళిక వసతులను పరిశీలించారు.

సుఖ వ్యాధుల నియంత్రణపై అవగాహన

కొణిజర్ల: మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో ఎయిడ్స్, క్షయ, ఇతర సుఖ వ్యాధుల నియంత్రణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వైఆర్‌జీకేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సూపర్‌వైజర్ నందిని, లింక్ వర్కర్ పద్మ మాట్లాడుతూ.. రక్త మార్పిడి కలుషిత సూదులు, ఇంజక్షన్లు, హెచ్ఐవీ సోకిన తల్లిదండ్రులకు పుట్టిన బిడ్డలకు హెచ్ఐవీ ఎయిడ్స్ సోకుతుందన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం



ప్రోత్సాహక నగదు అందిస్తున్న వికాస్ చౌదరి

మధిర: ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించాలనే ఆశయంతో ఉల్లాస్ స్వచ్ఛంద సంస్థ ప్రతీ ఏడాది విద్యార్థులకు నగదు పురస్కారం అందజేస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి వికాస్ చౌదరి అన్నారు. గురువారం స్థానిక స్థానిక సీపీఎస్ పాఠశాలలో చదువుతున్న పదిమంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున అందించి మాట్లాడారు. గతంలో ఇక్కడ పనిచేసిన హెచ్‌ఎం డాక్టర్ ప్రభుదయాళ్ ద్వారా ఇక్కడ విద్యార్థులకు ప్రోత్సాహక నగదు అందించడం జరిగిందన్నారు.

మొక్కలు నాటాలి

చింతకాని: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఇండోఫిల్ కంపెనీ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. దీపావళి సందర్భంగా ఇండోఫిల్ కంపెనీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా చేపట్టిన 50 వేల మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాలలో కంపెనీ ప్రతినిధులు గురువారం మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.సత్యనారాయణ, ఇండోఫిల్ కంపెనీ రీజనల్ మేనేజర్ శేషారెడ్డి, కంపెనీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మహిళా మత్స్యకారులకు గుర్తింపు కార్డులు అందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు/కల్లూరురూరల్: రాష్ట్రంలోని రైతుల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. కల్లూరు మండలంలోని ఎర్రబోయినపల్లిలో డీసీఎంఎస్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్‌తో కలిసి ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ కేంద్రాల్లో సన్నధాన్యం అమ్మడం ద్వారా మద్దతు ధరతో పాటు బోనస్ అందుతుందని తెలిపారు. ఆతర్వాత కల్లూరులో మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కొత్త సభ్యులకు మత్స్యశాఖ ఆధ్వర్యాన జారీ చేసిన గుర్తింపు కార్డులను ఎమ్మెల్యే రాగమయి అందచేశారు. చేపల మార్కెట్ కోసం స్థలం కేటాయించి, అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈకార్యక్రమాల్లో మార్కెట్ చైర్మన్ భాగం నీరజాదేవి, జిల్లా మత్స్య శాఖాధికారి శివప్రసాద్, తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏఓ ఎం.రూప, నాయకులు పసుమర్తి చందర్‌రావు, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఏనుగు సత్యంబాబు, భాగం ప్రభాకర్, తక్కెళ్లపాటి దుర్గాప్రసాద్, పోట్రు అర్జున్‌రావు, ఎస్.కే.ఉస్మాన్, మేరుగు వాణి, కస్తూరి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎర్రబోయినపల్లిలో ధాన్యం నిలువ చేసేందుకు ఎఫ్‌సీఐ ఆధ్వర్యాన గోడౌన్ నిర్మించాలని స్థానిక రైతులు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే, ఎరువుల కొరతతీర్చడంతో పాటు ఎర్రబోయినపల్లికి బస్సు నడిపించాలని కోరారు.

ముగిసిన పోషణ మాసోత్సవం



మధిర: సీమంతం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



కల్లూరురూరల్: చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

మధిర/సత్తుపల్లిరూరల్/కల్లూరురూరల్: పోషక ఆహారంతోనే ఆరోగ్యంగా ఉంటామని మధిర ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ జి.కృష్ణశ్రీ, సీడీపీఓలు మెహరున్నీసా, రత్తమ్మ, సీహెచ్ఓ అన్నమ్మ తెలిపారు. పోషణమాసం ముగింపు సందర్భంగా గురువారం మధిర స్థానిక రైతు వేదికలో వివిధ ప్రదర్శనల ద్వారా గురువారం మహిళలకు అవగాహన కల్పించారు. సత్తుపల్లిలోని బేతుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో, కల్లూరు మండలంలోని చంద్రుపట్ల సెక్టార్ పరిధిలోగల ముచ్చవరం గ్రామాల్లో గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాలల్లో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు శారారాణి, విజయకుమారి, గంగాజలం, ప్రసాద్, శిరీష, విజయ్, సరోజిని, సుజాత, భవాని, సంధ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆహార దినోత్సవం..



పండ్లు అందిస్తున్న విద్యార్థులు

కల్లూరురూరల్: కల్లూరు పాఠశాలలో అంతర్జాతీయ ఆహార దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు పోషక విలువల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమన్ని స్థానిక సెంట్ మైకేల్ పాఠశాల విద్యార్థులతో కలిసి నిర్వహించారు.

పండ్లు పంపిణీ..

సత్తుపల్లిటౌన్: జేవీఆర్ కళాశాలకు చెందిన వృక్ష శాస్త్ర విద్యార్థులు ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.గోపి, వైస్ ప్రిన్సిపాల్ పీర్ సాహెబ్, ఆస్పత్రి యాజమాన్యం, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎస్.బాబు, తెలుగు విభాగాధిపతి పూర్ణ చంద్రరావు అభినందించారు.

అవినీతిపై విచారణ జరపాలి



వైరా మున్సిపల్ కమిషనర్ గురులింగంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వైరా: వైరా మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి కమిషనర్ యు.గురులింగాలనికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వీరభద్రం, సుధాకర్ మాట్లాడుతూ.. మున్సిపల్ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చింతనిప్పు చలపతిరావు, వైరా డివిజన్ కమిటీ సభ్యుడు మణి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

చింతకాని: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీఓ చంచు శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని రామకృష్ణాపురం సెయింట్ థెరిస్సా ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండలస్థాయి పాఠశాలల క్రీడలు గురువారం ముగిశాయి. రెండో రోజు అండర్–14, 17 విభాగాల్లో.. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీల్లో ప్రతిభ చూపిన బాలురకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ సలాది రామారావు, సెయింట్ థెరిస్సా హైస్కూల్ ప్రిన్సిపాల్ సంతోష్, క్రీడల కన్వీనర్ స్టీఫెన్, మండల కార్యదర్శి కృష్ణయ్య, పీడీలు పాల్గొన్నారు.

పినపాక డాన్‌బోస్కో పాఠశాలలో..

తల్లాడ: మండలంలోని పినపాక డాన్‌బోస్కో పాఠశాలలో బాలికలకు నిర్వహించిన మండలస్థాయి క్రీడల పోటీలను ఎంఈఓ దామోదరప్రసాద్ గురువారం ప్రారంభించారు. తల్లాడ కాంప్లెక్స్ హెచ్‌ఎం ప్రసాదరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి మండలస్థాయి క్రీడలు..

ముదిగొండ: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడల పోటీలను విద్యార్థులకు సెయింట్ ఆన్స్ పాఠశాలలో.. శుక్ర, శని వారాల్లో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ రమణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న శ్రీహర్ష

వైరారూరల్: మండలంలోని పుణ్యపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముక్త్ భారత్‌లో భాగంగా ప్రభుత్వ వైద్యుడు శ్రీహర్ష ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. క్షయవ్యాధి అనుమానితులకు తెమడ పరీక్ష నిర్వహించారు. అలాగే రక్తపోటు, మధుమేహం తదితర పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కనకరాధ, హెల్త్ అసిస్టెంట్ రవి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో..

ముదిగొండ: న్యూలక్ష్మీపురంలోని కేజీబీవీలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిణి అంకం అరుణాదేవి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. విద్యార్థినులకు సీపీఆర్ గురించి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మధుసూదన్‌రావు, సూపర్‌వైజర్‌లు లత, రత్నకుమారి, పద్మావతి పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలి



ఏఐటీయూసీ సభ్యత్వాలు అందిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు

సత్తుపల్లిరూరల్: దశాబ్దాల కాలం పాటు ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు జీఓ నంబర్ 60 ప్రకారం జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సత్తుపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులకు ఆయన చేతుల మీదుగా ఏఐటీయూసీ సభ్యత్వాన్ని అందించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ, జిల్లా సమితి సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

‘ఓటు చోరీ’పై అవగాహన ర్యాలీ

బోనకల్: మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఓటు చోరీపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గారావు, నాయకులు కిషోర్ కుమార్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ముదిగొండ: మండలంలోని గంధసిరి మున్నేటి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు సీఐ ఓ.మురళి తెలిపారు. గురువారం చేపట్టిన వాహనాల తనిఖీల్లో భాగంగా మున్నేటి వద్ద ఒకటి, కమలాపురం వద్ద ఇంకో ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్లు, యజమానులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

కేసు నమోదు

కారేపల్లి: మండలంలోని గాంధీనగర్‌కు చెందిన ఈసాల కోటమ్మ ఈ నెల 2న తన వ్యవసాయ భూమిలో గేదెలను మేపుతుండగా.. అదే గ్రామానికి చెందిన ఈసాల వెంకన్న, అతని కుమారులు ఉదయ్, రాకేష్‌లు దాడికి పాల్పడ్డారు. ఈ విషయమై గురువారం బాధితురాలు ఫిర్యాదు చేయగా.. కారేపల్లి ఎస్సై గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థి రాజేష్‌కు సన్మానం

ఎర్రుపాలెం: మండలంలోని బుచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన విద్యార్థి తోటపల్లి రాజేష్ ఇటీవల నిర్వహించిన కౌన్సిలింగ్‌లో కరీంనగర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. ఈ సందర్భంగా గురువారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థి రాజేష్, తల్లిదండ్రులను నవతరం సంఘం మండల కమిటీ నాయకులు లోకేశ్వరరావు, సామేలు, రమేష్, శ్రీనివాసరావు, బాలరాజు శాలువలతో ఘనంగా సత్కరించి అభినందించారు.

మరమ్మతులు చేపట్టాలి

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోని అనేక ప్రాంతాల్లో రోడ్లు గుంతలు పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొంటూ బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక విజయవాడ రోడ్డుపై గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు శివరాజు సుమంత్ మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్లపై మరమ్మతులు చేపట్టాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో కృష్ణారావు, సాంబశివరావు, రమేష్, శేషుకుమార్, నాగేంద్రబాబు, రామకృష్ణ, సాయిరామ్, ప్రభుదాస్ పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



టీకాలు వేస్తున్న వైద్యులు

పెనుబల్లి: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని వైద్యాధికారి సృజన అన్నారు. గురువారం మండలంలోని పార్థసారధిపురంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సుమారు 540 పశువులకు ఉచితంగా వ్యాధి నివారణ టీకాలు వేయించారు.